నగరమా.. నరకమా..

- పారని నీరు.. తప్పని అవస్థలు
- రొచ్చురొచ్చుగా మారుతున్న నగరంలోని వీధులు

నెల్లూరు (పొగతోట) : వర్షాకాలంలో నగరంలోని రోడ్లు రొచ్చురొచ్చుగా తయారవుతున్నాయి. చినుకుపడితే అడుగు తీసి వేయడం కష్టంగా మారుతోంది. చిన్నపాటి వర్షానికే వీధులు బురదమయం అవుతున్నాయి. చిన్న బజార్, పెద్దబజార్, ఆచారి వీధి, ఏసీ కూరగాయల మార్కెట్, లోతట్టు ప్రాంతాల వీధులు చిత్తడిగా మారిపోతున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై నిలుస్తోంది. వర్షం తగ్గిన తర్వాత పాదచారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అడుగు తీసి అడుగు వేయడానికి నరక యాతన అనుభవిస్తున్నారు. ప్రధానంగా ఏసీ కూరగాయల మార్కెట్ చుట్టు పక్కల ప్రాంతాలు మరింత దుర్భరంగా తయారవుతున్నాయి.

ప్రధానంగా..

మార్కెట్లో చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయడంతో ఆయా ప్రాంతాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. పెద్ద బజారు, చిన్న బజారు, ఆచారి వీధి రోడ్లు డ్రెయినేజీని తలపిస్తున్నాయి. వర్షపు నీరు, మురుగునీరు కలిసిపోయి రోడ్లలో ప్రవహిస్తున్నాయి. నగర జనాభా రోజురోజుకు పెరగడం రోడ్లు, డ్రెయినేజీలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో వర్షపు నీరు బయటకు ప్రవహించే అవకాశాలు లేకుండా పోయాయి. సాధారణ వర్షానికే గాంధీ బొమ్మ, ట్రంకు రోడ్డు తదితర ప్రాంతాల రోడ్లు జలమయం అవుతున్నాయి. ఆయా సమయాల్లో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి వద్ద నిత్యం మురుగునీరు, వర్షపు నీరు ప్రవహిస్తూ ఉంటుంది. దీంతో ఆవైపుగా ప్రయాణించే పాదచారులు నానా అవస్థల పడుతున్నారు. మురుగునీరు, వర్షపు నీరు ప్రవహించేలా కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కనకమహల్ సెంటర్లో ఇదీ పరిస్థితి



సండే మార్కెట్లో నిలిచిన నీరు





రేపట్నుంచి మండల పూజోత్సవాలు

నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 16 నుంచి డిసెంబర్ 26వ తేదీ వరకు మండల పూజోత్సవాలు జరుగనున్నాయని శ్రీస్వామిఅయ్యప్ప సేవా సమాజం అధ్యక్షుడు గూడల శేషగిరిరావు తెలిపారు. ఈ మేరకు దేవస్థానంలో మండల పూజోత్సవాల ఆహ్వాన పత్రికలను ప్రధాన కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కార్యవర్గ సభ్యులు బట్టేపాటి నరేంద్ర రెడ్డి, పావళ్ల ప్రసాద్‌లతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ వడకేడత్తు పెరుంబడప్పుమన కేశవన్ నంబూద్రిపాద్ ఆధ్వర్యంలో విశేష హోమాలు, సహస్ర కలశాభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. శుక్రవారం రాత్రి 7 గంటలకు ధ్వజారోహణతో మండలపూజకు అంకురార్పణ జరుగుతుందన్నారు. ప్రతిరోజు విశేష పూజలు జరుగుతాయని, భక్తులు తరలిరావాలని కోరారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న భక్తులు

విద్యుత్ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్



హాజరైన అధికారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్లలో పెట్రోలింగ్ నిర్వహించి లోపాలను వెంటనే పరిష్కరించాలని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ అధికారులను ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో రూరల్ డివిజన్ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని, ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్లకు గురైతే సంబంధిత అధికారిపై చర్యలు తప్పవన్నారు. వ్యవసాయ వినియోగదారులకు తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని, విద్యుత్ సంస్థకు రావల్సిన పెండింగ్ బిల్లుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యుత్ మీటర్లను మార్చిన సందర్భాల్లో విద్యుత్‌శాఖకు చెందిన ట్యాబ్‌లలో వివరాలు పొందుపరచాలని తెలిపారు. డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి, డీఈఈలు రాము, భానునాయక్, చిన్నస్వామి నాయక్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ సుబ్బారావు, ఏడుకొండలు, ఏఈ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఏడాదికి 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రామారావు, జాతీయ కార్యదర్శి మమత డిమాండ్ చేశారు. నగరంలోని ఇందిరాభవన్‌లో జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయని, విచ్చలవిడిగా బెల్టు షాపులు తెరుస్తున్నట్లు ఆరోపించారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు నాగరాజు, గణేష్, నాగిరెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.



ఇందిరాభవన్‌లో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ నేతలు

➡ నగరంలోని మద్రాసు బస్టాండ్ వద్ద ఉన్న నెహ్రూ విగ్రహానికి కాంగ్రెస్ నేతలు దేవకుమార్, ఉడతా వెంకట్రావ్‌యాదవ్, బాలసుధాకర్ నివాళులర్పించారు.

నారాయణలో వైద్య పరీక్షలు

నెల్లూరు(అర్బన్) : ప్రపంచ డయాబెటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 20వ తేదీ వరకు ప్రత్యేక డయాబెటిక్ చెకప్‌తో కూడిన ఉచిత పరీక్షలు అందిస్తున్నామని నారాయణ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం ఆస్పత్రిలో ఆవిష్కరించారు. ఫిజిషియన్ డాక్టర్ దొరసానమ్మ, డాక్టర్ మేరిగ రాజేష్‌కుమార్, జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మహీధర్‌రెడ్డి, నేత్ర డాక్టర్ సుధ తదితరులు పాల్గొన్నారు.



కూటమికి ప్రజా సమస్యలు పట్టవు

నెల్లూరు(అర్బన్) : కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఆరోపించారు. ప్రజా పోరులో భాగంగా ఆ పార్టీ నాయకులు గురువారం చలో కలెక్టరేట్‌ను నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మ నుంచి వీఆర్సీ మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మూలం రమేష్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుతో పేద, బడుగు, బలహీన వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. మరోవైపు నగరంలో దోమలు, తాగునీటి సమస్యల గురించి ఎమ్మెల్యేలు, మంత్రులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య, సీనియర్ నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, నాగేశ్వరరావు, కొండా ప్రసాద్, ఆర్.శ్రీనివాసులు పాల్గొన్నారు.



నమ్మించి.. మోసగించి

నెల్లూరు(క్రైమ్) : ఓ మహిళను నమ్మించి మోసగించిన వ్యక్తితో పాటు అతనికి సహకరించిన కుటుంబ సభ్యులపై మహిళా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ముత్తుకూరు మండలానికి చెందిన ఓ మహిళకు గతంలో వివాహమైంది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమె భర్త నుంచి విడిపోయింది. నగరంలోని ఓ షాపులో పనిచేసుకుంటూ పిల్లలను పోషించుకుంటోంది. అదేషాపులో పనిచేస్తున్న సుమన్ ఆమెను పెళ్లి చేసుకుంటానని, పిల్లలను చూసుకుంటానని నమ్మించాడు. దీంతో ఇద్దరు సహజీవనం చేయసాగారు. ఈ క్రమంలో సుమన్ వేరే మహిళతో సన్నిహితంగా ఉంటూ ఆమెను దూరంగా పెట్టసాగాడు. ఈవిషయమై ఆమె అతన్ని నిలదీయగా కులం పేరుతో దూషించడమే కాకుండా ఆమెను శారీరకంగా, మానసికంగా హింసించసాగాడు. అతని కుటుంబసభ్యులు సైతం ఆమెను ఇబ్బందులకు గురిచేయసాగారు. దీంతో బాధితురాలు గురువారం మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తకావిష్కరణ



నెల్లూరు(బృందావనం) : విద్యావేత్త, రాష్ట్రపతి అవార్డు గ్రహీత వైటీ మిత్ర రచించిన 'ఆంధ్ర క్రైస్తవ అనువాద కీర్తనల క్లుప్త చరిత్ర' అనే పుస్తకాన్ని నగరంలోని వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న బాప్టిస్టు చర్చి డొనీహాల్లో గురువారం ఆవిష్కరించారు. రెవరెండ్ డేవిడ్ లివింగ్‌స్టన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి నల్గొండ డిప్యూటీ కలెక్టర్ వి.ఆనంద్‌రావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. రెవరెండ్ హరిపాల్, డాక్టర్ కె.రాజకుమారి, డాక్టర్ నిర్మలకుమార్, రెవరెండ్ ఎ.జయకుమార్, డాక్టర్ పి.జోనాథన్‌లు మాట్లాడారు. బాప్టిస్టుచర్చి డొనీహాల్ సంఘ కాపరి రెవరెండ్ కె.శ్యాంసన్‌కుమార్, డాక్టర్ సుందర్, జోసఫ్, ప్రొఫెసర్ టి.పాల్‌ఆర్మ్‌స్ట్రాంగ్, ప్రవీణ, అనితారాయ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి కలెక్టర్ సన్మానం

నెల్లూరు(అర్బన్) : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, సాహితీవేత్త గండికోట సుధీర్‌కుమార్‌ను కలెక్టర్ ఆనంద్ గురువారం తన చాంబర్‌లో సన్మానించారు. బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలపై ప్రజలను చైతన్యం చేయడమే కాకుండా పచ్చదనం-పరిశుభ్రతపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నందుకు సుధీర్‌కుమార్‌ను సన్మానించినట్లు కలెక్టర్ తెలిపారు. డీఈఓ బాలాజీరావు పాల్గొన్నారు.



సుధీర్‌కుమార్‌ను సత్కరిస్తున్న కలెక్టర్

చాచా నెహ్రూకు ఘన నివాళి

నెల్లూరు(బారకాసు) : భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నగరంలోని మద్రాసుబస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి మేయర్ స్రవంతి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువత చాచా నెహ్రూను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.



నెహ్రూ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ స్రవంతి

జాతీయస్థాయి పోటీలకు రత్నం విద్యార్థిని

నెల్లూరు (టౌన్) : జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు తమ పాఠశాల విద్యార్థి పి.లక్ష్మీభావజ్ఞ హంసిని ఎంపికైనట్లు రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు తెలిపారు. స్థానిక రత్నం స్కూల్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినిని గురువారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-14 రికర్వ్ రౌండ్ విభాగంలో విజయం సాధించిందన్నారు. ఈనెల 19న అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ ఆర్చరీ పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. జూనియర్ మేనేజర్ అజేయ్‌సింగ్, ప్రిన్సిపల్ మణిమాల పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

వేదగిరిలో పవిత్రోత్సవాలు

నెల్లూరు సిటీ : రూరల్ మండలం నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలు గురువారం జరిగాయి. వైఖానస ఆగమ విద్వాన్ డాక్టర్ పి.సత్యనారాయణాచార్యులు, అర్చకుడు భాస్కరాచార్యులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ గోపి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా బాలల దినోత్సవం

నెల్లూరు (టౌన్) : స్థానిక క్రాంతినగర్‌లోని మున్సిపల్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం చిన్నారులకు పండ్లు, పెన్నులను అందజేశారు. విశ్రాంత సోషల్ వెల్ఫేర్ అధికారి ఖాసీం పాఠశాలకు రెండు ఫ్యాన్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ తిరుపాలు, బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, ఉపాధ్యాయులు జయలక్ష్మి, గౌసియాబేగం, దీప్తి, గురుమూర్తి, శివలక్ష్మి, బషీర్, రఘు, రమేష్, హరి పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

కొండాయపాళెంలోని మున్సిపల్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి హాజరై, మాట్లాడారు. పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. పిల్లలకు మంచి, చెడ్డలు తల్లిదండ్రులు చెప్పాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కరరావు పాల్గొన్నారు.

స్పాస్టిక్ సెంటర్‌లో..

నెల్లూరు(అర్బన్) : స్థానిక మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎమ్మెస్సార్ స్పాస్టిక్ సెంటర్‌లో బాలల దినోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఎంసీ మెంబర్, అడ్వైజర్ దాసరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ చాచా నెహ్రూను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం బాలలకు తలసేమియా సెంటర్ కో-కన్వీనర్ పర్వీన్, మెంబర్ అరుణకుమారి, ఫిజియోథెరపిస్ట్ నవీన్‌ల దాతృత్వంతో పండ్లు, బహుమతులు అందించారు. స్పాస్టిక్ సెంటర్ కో-కన్వీనర్ బలరామయ్యనాయుడు, రెడ్‌క్రాస్ జిల్లా సెక్రటరీ మస్తానయ్య, వైస్ ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి, సంధ్యా, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారులకు సన్మానం

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పురమందిరంలో ఏవీకే ఫౌండేషన్, కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. శాస్త్రీయ, నృత్య ప్రదర్శనల్లో ప్రతిభ చూపిన చిన్నారులను సత్కరించినట్లు నిర్వాహకుడు కేతా సుబ్బారావు తెలిపారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో ప్రదీప్, రియాజ్‌బాషా, ఎన్వీ రమణయ్య, సత్యనారాయణ, డి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



కొండాయపాళెంలోని మున్సిపల్ పాఠశాలలో..



స్పాస్టిక్ సెంటర్‌లో పండ్ల పంపిణీ



సత్కారం అందుకున్న చిన్నారులతో నిర్వాహకులు

క్లుప్తంగా

ఇన్‌చార్జి ఆర్టీఓగా బాలమురళీకృష్ణ



నెల్లూరు (టౌన్) : నెల్లూరు ఇన్‌చార్జి ప్రాంతీయ రవాణాశాఖాధికారిగా ఎం.బాలమురళీకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ప్రస్తుతం ఆర్టీఓగా పనిచేస్తున్న శ్రీచందన విజయవాడలో జరుగుతున్న శాఖాపరమైన శిక్షణలో పాల్గొనేందుకు అక్కడకు వెళ్లారు. ఆమె నెల రోజుల పాటు శిక్షణలో ఉంటారు. కాగా బాలమురళీకృష్ణ తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. రవాణాశాఖలో సేవలన్నింటినీ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంటి దగ్గర నుంచి ఆన్‌లైన్‌లో సేవలు పొందవచ్చన్నారు. దళారుల మాటలకు మోసపోవద్దని సూచించారు.

లారీ క్లీనర్ అదృశ్యం



మధుసూదన్‌రెడ్డి

నెల్లూరు(క్రైమ్) : లారీ క్లీనర్ అదృశ్యమైన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. వెంకటేశ్వరపురం నల్లకాలువ ప్రాంతానికి చెందిన బి.మధుసూదన్‌రెడ్డి లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నారు. రెండు నెలల కిందట లారీలో సరుకు దించేందుకు ఆయన తిరుపతి వెళ్లి అదృశ్యమయ్యారు. కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించి జాడ తెలియకపోవడంతో తల్లి సుబ్బమ్మ బుధవారం రాత్రి నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు నవాబుపేట పోలీసులను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా విజ్ఞప్తి చేశారు.

లంకా దహన మహోత్సవం నేడు

నెల్లూరు(బృందావనం) : పప్పులవీధిలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి లంకా దహన మహోత్సవం జరుగనుందని నిర్వాహకులు గురువారం తెలిపారు. రాత్రి 7.30 గంటలకు 1,008 దీపాలతో విశేషాలంకరణ ఉంటుందన్నారు.

క్రీడాకారుల ఎంపిక నేడు


నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఇంటర్ సర్కిల్ టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్ పోటీలకు విద్యుత్ క్రీడాకారుల ఎంపిక శుక్రవారం నగరంలో జరుగుతుందని ఎస్పీడీసీఎల్ జిల్లా స్పోర్ట్స్, గేమ్స్ సెక్రటరీ ఆర్.వేలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శాశ్వత విద్యుత్ ఉద్యోగులు, జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2 ఉద్యోగులకు విద్యుత్ భవన్‌లో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఎంపికలు జరుగుతాయని, ఆసక్తి కలిగిన వారు 90308 02038, 95506 44396 నంబర్లను సంప్రదించాలని కోరారు.

హెవీ లైసెన్స్ రెన్యూవల్‌కు సర్టిఫికెట్ తప్పనిసరి

- డీటీసీ చందర్


నెల్లూరు (టౌన్) : హెవీ డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ సమయంలో వాహనదారులు రిఫ్రెషర్ ట్రైనింగ్ కోర్సు పూర్తి చేసినట్లు సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుందని డీటీసీ బి.చందర్ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్‌కు ఒకరోజు రిఫ్రెషర్ కోర్సును పూర్తి చేయాలన్నారు. దీనికోసం రూ.1000 చలానా, రూ.200 జీఎస్టీతో కలుపుకుని రూ.1200 చెల్లించాలన్నారు. ఈ శిక్షణకు ఏపీలో మూడు ప్రాంతాల్లో డ్రైవింగ్ స్కూల్స్‌ను ఎంపిక చేశారన్నారు. జిల్లాలోని కాకుటూరులో ఉన్న ఆర్టీసీ ట్రైనింగ్ స్కూల్‌ను ఎంపిక చేశారన్నారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ కార్యాలయంలో శిక్షణకు చలానా చెల్లించే అవకాశం ఉందన్నారు.

ఎండోస్కోపి వితరణ



నెల్లూరు(అర్బన్) : నగరానికి చెందిన పొన్నలూరు ద్వారకానాథ్‌రెడ్డి తన తల్లిదండ్రులు కోదండరామిరెడ్డి, ప్రమీలమ్మ జ్ఞాపకార్థం రూ.14 లక్షలు విలువ చేసే ఎండోస్కోపి యంత్రాన్ని జయభారత్ ఆస్పత్రికి వితరణ చేశారు. దీనిని ఆస్పత్రి చైర్మన్ పొన్నలూరు సీతారామిరెడ్డి గురువారం ప్రారంభించారు. డాక్టర్ లక్ష్మణచంద్ర, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి హరికుమార్‌రెడ్డి, బాలుసుబ్బారావు, డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం, గుర్రం సుధాకర్, జనరల్ మేనేజర్ గురుప్రసాద్ పాల్గొన్నారు.


16, 17న విధుశేఖర భారతి విజయ యాత్ర



విధుశేఖరభారతి మహాస్వామి

నెల్లూరు(బృందావనం) : జగద్గురు శంకరాచార్య భారతి తీర్థ మహాస్వామి శిష్యులు విధుశేఖర భారతి మహాస్వామి నెల్లూరు నగర విజయ యాత్ర ఈనెల 16, 17వ తేదీల్లో జరుగుతుందని వెంకటాచలం మండలం ఇసుకపాలెం శ్రీభారతి తీర్థవేద సంస్కృత పాఠశాల నిర్వాహకులు గురువారం తెలిపారు. పుష్కరకాలం తరువాత నెల్లూరుకు ఆగమనం చేసి భక్తులకు అనుగ్రహభాషణ చేస్తారన్నారు.


డయాబెటిస్‌ను గుర్తించడం కీలకం



డాక్టర్ పెంచల ప్రసాద్

నెల్లూరు(అర్బన్) : సకాలంలో డయాబెటిస్(మధుమేహం)ను గుర్తించి డాక్టర్ల సలహాలు పాటిస్తే వ్యాధిని నియంత్రణలో ఉంచవచ్చని మెడికవర్ స్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్ పెంచలప్రసాద్ అన్నారు. నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో గురువారం రోగులు, సహాయకులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుత కాలంలో ఆహారపు అలవాట్లు మార్చుకోవాలన్నారు. ప్రతిరోజు వాకింగ్, సైక్లింగ్, జాగింగ్, స్కిప్పింగ్ లాంటివి చేయాలన్నారు. పొగతాగడం, మద్యం తాగడం మానుకోవాలన్నారు.

అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్) : డయాబెటిస్‌పై తగిన అవగాహన కలిగి ఉండాలని కాస్మోటిక్ డెంటల్ సర్జన్ డాక్టర్ డోలా సుష్మిత అన్నారు. ప్రపంచ డయాబెటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుజబుజనెల్లూరులోని పీఎంపీ కార్యాలయంలో గురువారం ఉచిత రక్తపరీక్షలు నిర్వహించారు. షుగర్ వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్పొరేటర్ బద్దెపూడి గిరి, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, సాయి, సత్యం, మధుసూదన్‌రావు, టెక్నీషియన్లు పూజిత్, మదన్ పాల్గొన్నారు.

జాగ్రత్తలతో షుగర్ దూరం



డాక్టర్ దత్తాత్రేయులు

నెల్లూరు(అర్బన్) : కలుషితం లేని ఆహారం తీసుకోవడం, తగిన వ్యాయామం ద్వారా మధుమేహం(షుగర్) జబ్బును దూరం చేయవచ్చని పలువురు డాక్టర్లు పేర్కొన్నారు. ప్రపంచ మధుమేహం దినోత్సవాన్ని పురస్కరించుకుని హరనాథపురంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మధుమేహం-నివారణ అనే అంశంపై గురువారం సదస్సు జరిగింది. ప్రభుత్వ పెద్దాస్పత్రి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషాబాషా, రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల డాక్టర్ దత్తాత్రేయులు మాట్లాడుతూ షుగర్ నియంత్రణలో లేకుంటే కళ్లు, కాళ్లు, కిడ్నీ, మెదడు లాంటి ప్రధాన అవయవాలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. తగిన జాగ్రత్తలు పాటించి మందులు వాడితే షుగర్‌ను నియంత్రించవచ్చన్నారు. సీనియర్ డాక్టర్లు రఫీ, శ్యామ్‌ప్రసాద్, బాషా, సబ్‌కమిటీ కన్వీనర్ డాక్టర్ శ్రీనునాయక్‌లు మాట్లాడారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఉదయభాస్కర్, నగేష్, కుసుమకుమారి పాల్గొన్నారు.

మార్కెట్లోకి న్యూ మారుతి డిజైర్

నెల్లూరు (టౌన్) : నగరంలోని విష్ణు కార్స్‌లో న్యూ మారుతి డిజైర్ కారు అందుబాటులోకి రావడం సంతోషకరమని ఇన్‌చార్జి ఆర్టీఓ బాలమురళీకృష్ణ తెలిపారు. ఆయన గురువారం విష్ణుకార్స్ మారుతీ సుజుకి ఎరెనాలో ఈ కొత్త కారును విడుదల చేశారు. దీని ప్రారంభ ధర రూ.6.79 లక్షలు ఉంటుందన్నారు.

కార్తీక దీపోత్సవం నేడు

నెల్లూరు(బృందావనం) : ఇరుకళల పరమేశ్వరి ఆలయ సమీపంలో గణేష్‌ఘాట్ వద్ద శుక్రవారం మహాకార్తీక దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన గురువారం పరిశీలించారు. భక్తులు తరలిరావాలని కోరారు.